గుంతల రోడ్లకు మరమ్మతులెప్పుడు?

- వేల్పూర్ మండలంలో అధ్వానంగా ప్రధాన రహదారులు
- పట్టించుకోని అధికారులు


పచ్చలనడ్కుడ ఊరచెరువు సమీపంలో రహదారిపై ఏర్పడ్డ గుంతలు


వేల్పూర్‌లో దెబ్బతిన్న రోడ్డు

వేల్పూర్: మండలంలో ప్రధాన రహదారులపై అడుగడుగునా ఏర్పడిన గుంతలు ప్రయాణానికి తీవ్ర ఆటంకంగా మారాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపు నీరు గుంతలలో నిలిచి ఉండటంతో వాహనదారులు గుంతలను గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా సంబంధిత అధికారులు గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..
వేల్పూర్ మీదుగా ఆర్మూర్, భీమ్‌గల్‌కు, పచ్చలనడ్కుడ మీదుగా ఆర్మూర్‌కు, భీమ్‌గల్‌కు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారులు ఉన్నాయి. నిత్యం వేలాది వాహనాలు ఆర్మూర్, భీమ్‌గల్‌కు రాకపోకలు సాగిస్తుంటాయి. వేల్పూర్ పసుపు పార్కు సమీపంలో రైల్వే వంతెన వద్ద రోడ్డుకు వంతెనకు ఉన్న జాయింటు వద్ద తారు లేచిపోయి ఇనుప రాడ్లు బయటకు వచ్చాయి. వేల్పూర్‌లో గాంధీ విగ్రహం నుంచి మసీదు వరకు సుమారు పదిచోట్ల అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. ప్రధాన రహదారిపై అమీనాపూర్ వద్ద, మర్సుకుంట కల్వర్టు వద్ద, వేల్పూర్ మోతె గ్రామాల మధ్య వరదనీరు వెళ్లే కల్వర్టు వద్ద, మోతె జీపీ ఎదుట రహదారి దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. పచ్చలనడ్కుడ ఊరచెరువు గత ఏడాది తెగిపోవడంతో వరద ఉధృతికి ఆర్అండ్‌బీ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. సంబంధిత అధికారులు మట్టిపోసి రహదారిని పునరుద్ధరించారు. కానీ తారు వేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పచ్చలనడ్కుడ, చేంగల్ గ్రామాల మధ్య రైతులు వ్యవసాయ పైపులైన్ల కోసం రోడ్డును తవ్వి తిరిగి పూడ్చివేశారు. వాటిపై సీసీగాని, తారు వేయకపోవడంతో మట్టి కుంగిపోయి గుంతలు ఏర్పడ్డాయి. గుంతల విషయమై మండల ఆర్అండ్‌బీ ఏఈ ప్రమీలను సంప్రదించగా గుంతలకు ప్యాచ్ వర్క్ త్వరలో చేయిస్తామని, పూర్తిస్థాయి మరమ్మతులు వర్షాకాలం ముగిసిన తర్వాత జరుగుతాయన్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి..



వేల్పూర్ మండల కేంద్రంతో పాటు, ఆర్అండ్‌బీ ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయాలి. రహదారులపై గుంతలతో వాహనాలు భారీగా కుదుపులకు గురవుతున్నాయి. గర్భిణులు, రోగులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. అధికారులు సమస్యను గుర్తించి తొందరగా మరమ్మతు చేపట్టాలి. – రేగుల్ల రాములు, వేల్పూర్

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం


మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు


నందిపేట పీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష నాయకులు


ఆర్మూర్‌లో మాట్లాడుతున్న మాస్ లైన్ ప్రజాపంథా నాయకులు ప్రభాకర్, దేవరాం

మాక్లూర్/ఆర్మూర్/నందిపేట్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర నేపథ్యంలో ఆర్మూర్ నియోజకవర్గంలో విపక్ష నాయకులను ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీజేపీ, బీఆర్ఎస్, ప్రజాపంథా మాస్ లైన్ నాయకులు వేర్వేరుగా ఆరోపించారు. మాక్లూర్, ఆర్మూర్, నందిపేట మండలాల్లో శనివారం తెల్లవారుజామున బీజేపీ, బీఆర్ఎస్, వామపక్ష నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతులను అణిచివేస్తూ ముందస్తు అరెస్టులు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలన్నింటిని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


జానకంపేట శివారులోని డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

బోధన్: గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సిబ్బందిని ఆదేశించారు. ఎడపల్లి మండలం జానకంపేట గ్రామ పంచాయతీని శనివారం డీపీవో తనిఖీ చేశారు. పారిశుద్ధ్యం నిర్వహణలో ఎలాంటి లోపాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌దాస్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డంపింగ్‌యార్డును సందర్శించి నిర్వహణను పరిశీలించారు. ఎంపీవో మన్మోహన్‌శాస్త్రి ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి


ఆర్మూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్: ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. పట్టణంలోని 1వ, 16వ వార్డులలో శనివారం ఆయన ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నివారించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెత్తను ఆరుబయట వేయవద్దని, మున్సిపల్ చెత్త వాహనాలకు అందించాలన్నారు. వార్డు అధికారులు, సానిటరి జవాన్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

లోపాలు లేకుండా చూడాలి



వర్ని: రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పర్యటనలో ఎలాంటి లోపాలు జరగకుండ చూడాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం చందూర్, మోస్రా మండలాల్లో పర్యటించనున్న నేపథ్యంలో శనివారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ప్రారంభోత్సవాలు చేసే భవనాలను, సభా వేదికను చందూర్ ,మోస్రా మండల కేంద్రాల్లో సబ్ కలెక్టర్ పరిశీలించారు.

తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమైనవి


ఆర్మూర్‌లో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నళిని


రుద్రూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం నిర్వహిస్తున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్: తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమైనవని, తల్లి పాలతోనే చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నళిని అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. పుట్టిన పిల్లలకు వెంటనే తల్లిపాలు తాగించినట్‌లెతే ఆరోగ్యంగా ఉంటారన్నారు. పిల్లలకు కనీసం ఆరు నెలల పాటు తల్లిపాలు తప్పకుండా పట్టించాలన్నారు. చిన్నారులను అంగ్‌వాడి కేంద్రాలకు పంపించాలన్నారు.

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంతో పాటు పోతంగల్ మండలం జల్లాపల్లి ఆబాదిలో శనివారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన, సాముహిక సీమంతాలు నిర్వహించారు. తల్లి పాల ప్రాముఖ్యతను అంగన్‌వాడీ టీచర్లు వివరించారు. సిబ్బంది వంజరి పద్మ, గంగామణి, రూప, ఆశ వర్కర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



సాలూరలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు.. బోధన్‌లో రక్తదానం చేస్తున్న నాయకులు

నవీపేట/రెంజల్/బోధన్‌టౌన్/బోధన్: బోధన్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి, సంబురాలు చేసుకున్నారు. ఒకరినొకరూ స్వీట్లూ తినిపించుకున్నారు. పలు మండలాల్లో పార్టీ నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు పండ్లు, పుస్తకాలను పంపిణీ చేశారు. ఆస్పత్రిల్లో రోగులకు పండ్లు అందజేశారు. అలాగే ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానం, రక్తదానం తదితర సామాజిక సేవా కార్యక్రమాలు చేశారు.


సాటాపూర్ చౌరస్తాలో..


ఎడపల్లిలో ..

సమస్యల పరిష్కారం కోసమే పోరాటాలు


బోధన్‌లో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

బోధన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పోరాడుతామని, భవిష్యత్తులో చేపట్టబోయే పోరాటాలకు ప్రజలను కార్యకర్తలను సన్నద్ధం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు సూచించారు. పట్టణంలో శనివారం సీపీఎం ముఖ్య నాయకులకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ఆమోదించిన నేపథ్యంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టబద్దత కల్పించి రాష్ట్రపతి ఆమోదం పొందేలా చూడాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మూతపడిన బోధన్ ఎన్డీఎస్ఎల్, సారంగాపూర్ కో–పరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలను ఎప్పుడు తెరపిస్తారో స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు శంకర్‌గౌడ్, జంగం గంగాధర్, బాలయ్య, ఎల్లప్ప, సాయిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దు



రుద్రూర్: రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టవద్దని, త్వరితగతిన పరిష్కరించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. రుద్రూర్ తహసీల్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. రెవెన్యూ సదస్సుల్లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ తారాబాయి, ఉప తహసీల్దార్ సురేందర్ నాయక్ ఉన్నారు.

మీనాక్షి నటరాజన్‌కు ఘన స్వాగతం



ఆలూర్‌లో డప్పువాయిద్యాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం.. కోలాటం ఆడుతున్న మానాలమోహన్‌రెడ్డి

ఆర్మూర్ టౌన్/పెర్కిట్: కాంగ్రెస్ శ్రేణులు చేపట్టిన పాదయాత్రలో భాగంగా ఆర్మూర్‌లోని ఆలూర్ బైపాస్ రోడ్డుకు చేరుకున్న కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు వారు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌లు పాదయాత్రను ప్రారంభించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



ఆర్మూర్‌లోని స్మైల్ పాఠశాలలో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లతో విద్యార్థులు.. సిద్ధార్థ కళాశాలలో..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో శనివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హౌసింగ్‌బోర్డు కాలనీలోని దిస్మైల్ పాఠశాలలో విద్యార్థులకు స్నేహితుల దినోత్సవం గురించి పాఠశాల కరస్పాండెంట్ రఫిక్‌గోహర్ వివరించారు. అనంతరం విద్యార్థులు ఒకరినొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కట్టుకున్నారు. పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్, బెట్టింగ్ మద్యపానానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

ఆదర్శం.. డొంకేశ్వర్ స్నేహితులు
డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ జెడ్పీహెచ్ఎస్‌లో 2001–02 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు తోటి మిత్రులకు ఆర్థికసాయం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. స్నేహితుల్లో ఎవరికి ఏ ఆపద వచ్చినా, శుభకార్యాలు నిర్వహించినా వారికి మేమున్నామంటూ ముందుంటున్నారు. ఒక్కొక్కరు ఒక్కోస్థాయిలో స్థిరపడినా, వాట్సప్ గ్రూపులో మాత్రం ఎప్పటికప్పుడు సమాచారం అందించుకుంటూ అందుబాటులో ఉంటున్నారు.


డొంకేశ్వర్ జెడ్పీహెచ్ఎస్ 2001-02 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

పరిశోధన ఫలితాలను సద్వినియోగం చేసుకోవాలి



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రం పరిశోధన ఫలితాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పసుపు రైతు పోరాట కమిటీ రాష్ట్ర నాయకుడు, స్వదేశీ జాగరణ్ మంచ్ కన్వీనర్ కోటపాటి నరసింహనాయుడు అన్నారు. కమ్మర్‌పల్లిలోని పసుపు పరిశోధన కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. 350 ఎకరాలకు సరిపడా రకాలను సాగు చేస్తూ రైతులకు ప్రయోజనకరమైన రీతిలో అధిక కుర్కుమిన్ కలిగిన వంగడాలను అందిస్తున్నట్లు కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మహేందర్ తెలిపారు. అనంతరం కోటపాటి మాట్లాడుతూ.. తాము పోరాడి సాధించుకున్న పరిశోధన కేంద్రం సమర్థవంతంగా పనిచేస్తున్న విషయాన్ని గమనించి అక్కడి శాస్త్రవేత్తలను, సిబ్బందిని అభినందించారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి భార్గవి ఆకాంక్షించారు. పెర్కిట్ మహిళ ప్రాంగణంలో శనివారం మహిళ శిశు సంక్షేమ శాఖ మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఆర్మూర్, భీంగల్ ప్రాజెక్ట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు బేటీ బచావో బేటీ పడావోలో భాగంగా ట్రెనింగ్ ఆఫ్ ట్రెనర్స్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భార్గవి మాట్లాడుతూ.. మహిళా సాధికారతతోపాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అధికారులు ఇందిర, శ్రీదేవి, మాధవి, రమదేవి, నాగలక్ష్మీ, శారద, విగ్నేష్,ఆంథ్, సౌమ్య, పుష్ప, పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరువు తూము షెట్టర్ ధ్వంసం



రుద్రూర్: కోటగిరిలోని దామర చెరువు తూము షెట్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. స్థానిక రైతులు శనివారం పొలాలకు వెళ్లగా, తూము షెట్టర్ ధ్వంసంను గమనించి ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులోకి పూర్తి స్థాయి వరద నీరు వచ్చిచేరింది. ఈ దశలో దుండగులు తూము షెట్టర్‌ను ధ్వంసం చేయడంతో చెరువులో ఉన్న నీరు తూము ద్వారా వృథాగా వెళ్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే తూము మరమ్మతులు చేపట్టి సాగు నీరు వృథా కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

పనులు పూర్తయిన ఇళ్లను పంపిణీ చేస్తాం



వర్ని: మండలంలోని కోటయ్య క్యాంపులో నిర్మాణ పనులు పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు అందజేస్తామని వర్ని ఎంపీడీవో వెంకటేశ్వర్ వెల్లడించారు. గ్రామంలోని ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. కోటయ్య క్యాంపులో 160 ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా 60 ఇళ్లు పూర్తయ్యాయని వీటిని త్వరలో ఇళ్లు లేని నిరుపేదలకు పంపిణీ చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం విద్యుత్ సరఫరా చేపట్టాలి



బాల్కొండ: సాగుకు 24 గంటలు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం ముప్కాల్ సెక్షన్ కార్యాలయంలో ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా నాయకుడు ముస్కు భూమేశ్వర్, మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్‌రెడ్డి, నాయకులు ముత్యంరెడ్డి, నర్సయ్య, సతీష్, భూమారెడ్డి, గోపానాథ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ముప్కాల్ పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, డీపీవో శ్రీనివాస్‌రావులకు వినతిపత్రాలు అందజేశారు. గ్రామంలో జీపీకి సంబంధించిన 10 శాతం భూమిని వెలికి తీయాలన్నారు. గ్రామంలో 140 నుంచి 150 వరకు ఇంటి నంబర్లు తారుమారయ్యాయన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. సమితి గౌరవ అధ్యక్షుడు నాయకుడు సంతోస్, అధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు మహేశ్, స్వామీ, కట్ట గోపి పాల్గొన్నారు.

గొర్రెలకు టీకాలు



మాక్లూర్: మండలంలోని ఒడ్డెట్‌పల్లి, అమ్రాద్, ముత్యంపల్లి గ్రామాలలో జిల్లా పశువైద్యాధికారి రోహిత్‌రెడ్డి, మండల పశువైద్యాధికారులు కిరణ్‌దేశ్‌పాండే. ఉమా సహేర్ ఆధ్వర్యంలో శనివారం పశువైద్య సిబ్బంది గొర్రెలకు టీకాలను వేశారు. జీవాలకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా ఈ టీకాలను వేస్తున్నట్టు పశువైద్యులు తెలిపారు. సిబ్బంది కల్యాణి, గంగాధర్, అహ్మద్‌పాషా, సికింధర్, సుధీర్, శ్యామల పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని బాలికల ఎస్సీ, బీసీ, కళాశాల వసతి గృహాలను శనివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలిసి అల్పాహారం తిన్నారు. కమిషనర్ వెంట సానిటేషన్ అధికారి గణేష్, సంతోష్‌లు ఉన్నారు.

సంక్షిప్తం

విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగ్స్ పంపిణీ



బోధన్: సాలూర మండలం తగ్గేల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం వర్ని మండల కేంద్రానికి చెందిన మాదాల చారిటబుల్ ట్రస్ట్ సీసీడీ ప్రతినిధులు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ట్రస్ట్ ప్రతినిధులు రవీంద్రనాథ్‌ఠాగూర్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల వితరణ
బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మండలం భవానిపేట్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని ఆధ్వర్యంలో బెంచీలను పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత
వేల్పూర్: మండల కేంద్రంలో టికాయి బాలేష్ కుమార్తె అద్విక కొన్ని రోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతుంది. వైద్య చికిత్సకోసం స్థానిక చేయూత ఫౌండేషన్ సభ్యులు శనివారం రూ. 10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

నియామకం
బోధన్‌టౌన్(బోధన్): బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ బోధన్ నియోజకవర్గ అధ్యక్షుడిగా చంటి నియమితులయ్యారు. పట్టణంలో శనివారం ఆయనకు జిల్లా అధ్యక్షుడు సంతోష్ నియామక పత్రాన్ని అందజేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ
బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 5 నుంచి 11 వరకు నిర్వహించనున్న కథా, గేయ రచన కార్యక్రమ పోస్టర్‌లను ప్రిన్సిపాల్ సురేష్, నిర్వాహకులు ఆవిష్కరించారు. అధ్యాపకులు, తదితరులున్నారు.

అందుబాటులో గడ్డి కట్ చేసే మిషన్‌లు
వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ సొసైటీలో గడ్డి, పంటను కట్ చేసే మిషన్‌లు అందుబాటులో ఉన్నాయని ఏఈవో స్నేహశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. కావాల్సిన రైతులు రూ. 10500 చెల్లించి తీసుకోవాలని తెలిపారు.

ఆర్ఆర్ నగర్‌లో వైద్య శిబిరం
కమ్మర్‌పల్లి: మండలంలోని రాజరాజేశ్వరీ నగర్‌లో శనివారం కమ్మర్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ నరసింహస్వామి రోగులను పరీక్షించి మందు లు అందజేశారు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

పాఠశాలలో ఎన్నికలు
బాల్కొండ: మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో శనివారం విద్యార్థులకు గ్రూప్‌స్థాయి ఎన్నికలను నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ గణేష్ హాజరై, మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. జోనల్ మేనేజర్ సంపత్, ప్రిన్సిపాల్ విజయ్ కర్షన్, సూపర్ వైజర్ రాజేందర్ ఉన్నారు.

భక్తులకు అన్నదానం
బాల్కొండ: ముప్కాల్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో, రెంజర్ల గ్రామంలోని హనుమాన్ ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా దాతలు అ న్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.